ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 10 నవంబరు 2024

Sunday Special



అద్భుతం.. మాధవ రాయస్వామి ఆలయం

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

ఓ వైపు భారీ కోటగోడలు.. మరోవైపు అత్యంత లోతైన లోయ.. మధ్యలో చార్మినార్‌ను తలపించేలా జుమ్మామసీదు.. పక్కనే ధాన్యాగారం. ఎదురుగా కత్తుల కోనేరు. ఒకవైపు శిల్పుల కళానైపుణ్యం ఉట్టిపడే రంగనాథస్వామి ఆలయం.. ఇంకోవైపు ఆకాశాన్ని తాకుతుందా అన్నట్టు ఉండే మాధవరాయస్వామి ఆలయ గోపురం.. వీటన్నింటినీ మించి రెండుకొండల నడుమ లోయలో ప్రవహించే పెన్నానది.. వెరసి గండికోట జిల్లాలోనే ఓ అద్భుత పర్యాటక ప్రాంతం. ఇక్కడి కట్టడాలు వెయ్యేళ్ల చరిత్రకు నిలువెత్తు దర్పణం కాగా.. పెన్నాలోయ గ్రాండ్ కెనాన్ ఆఫ్ ఇండియాగా ఖ్యాతిగాంచింది.




జుమ్మామసీదు

అపురూప చరిత్ర.. గండికోట

- సహజసిద్ధంగా ఏర్పడ్డ పెన్నాలోయ
- ఆకట్టుకుంటున్న మాధవరాయస్వామి ఆలయ గోపురం
- ఇప్పటికీ చెక్కుచెదరని శిల్పసంపద
- పర్యాటకులను ఆకర్షిస్తున్న మహాదుర్గం





జమ్మలమడుగు /కడప కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక స్థలాల్లో ముఖ్యమైనది గండికోట. దాదాపు వేయి సంవత్సరాలకు పైగా చరిత్రగల ఈ ప్రాంతం పర్యాటకులకు విశేషంగా ఆకట్టుకుంటోంది.

గండికోటను క్రీ.శ.1123 జనవరి 9న కల్యాణి చాళుక్య ప్రభువు త్రైలోక్యమల్లుడికి సామంతుడైన కాకరాజు పేరు గల సిద్ధన చోళ మహారాజు నిర్మించినట్లు నాటి శాసనాలు, కైఫీయత్తులు తదితర చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. కోటకు పడమర, ఉత్తర దిశల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన లోయలో పెన్నానది ప్రవహిస్తోంది. గండికోటను చుట్టేసినట్లు ఎర్రమల కొండల మధ్య ఆ నది కనిపిస్తుంది. కాకతీయుల కాలంలో కాయస్థ అంబదేవుడు కొంతకాలం గండికోటను పాలించాడు. అనంతరం విజయనగరరాజుల పాలనలోకి వచ్చింది. మొదట బుక్కనరాయలు ఆయన కుమారుడైన ప్రౌఢదేవరాయలు పాలించారు. ఆ పరంపరలోనే ఈ కోట పెమ్మసాని వంశీకులకు లభించింది. వారు 300 ఏళ్లకు పైగా ఈ కోటను పరిపాలించారు. తరువాత గోల్కొండ నవాబు కులీకుతుబ్‌షాహి సైన్యాధికారి మీర్‌జుమ్లా 1652 ఆగస్టు 25న నాటి గండికోట పాలకుడైన పెమ్మసాని తిమ్మనాయుడు నుంచి కోటను స్వాధీనం చేసుకున్నాడు. మీర్‌జుమ్లా తరువాత గోల్కొండ సామంతులైన కడప నవాబులు ఫక్కీర్‌ఖాన్, మహ్మద్‌ఖాన్ సహా హసఫ్‌జహీలా ప్రతినిధి కవిదుల్లాఖాన్, మోచమియా, ఆయన సతీమణి మదీనాబీబీ ఆ కోటను పాలించారు. ఆ వంశీకుల పాలనలోనే ఆ కోట టిప్పుసుల్తాన్‌కు దక్కింది. అనంతరం 1791లో ఇది ఆంగ్లేయుల పాలనలోకి వచ్చింది. తదుపరి ఆ కోట ప్రాధాన్యత తగ్గిపోయింది.

విగ్రహాలను తరలించారు..

గండికోటను 1652 ఆగస్టు 25న మీర్‌జుమ్లా స్వాధీనం చేసుకున్నారు. వీరు గండికోట లోని మాధవరాయ స్వామి ఆలయంలోకి వస్తారని తెల్సి కొందరు వీరులు పెద్దల సూచనలతో గర్భాలయం వెనుక గల కొన్ని రాళ్లను తొలగించి దేవతామూర్తుల విగ్రహాలను జాగ్రత్తగా బయటికి తరలించారు. ఆలయం వెనుక ద్వారం నుంచి పెన్నాలోయలోకి చేర్చి అక్కడి నుంచి నది ద్వారా మైదుకూరు ప్రాంతానికి చేర్పించి బావిలో దాచారు. వందేళ్ల తరువాత స్థానికులు గుర్తించి వాటిని వెలికితీసి మైదుకూరులో వాటికి ఆలయం నిర్మించారు. దీంతో గండికోటలోని మాధవరాయ స్వామి ఆలయం గర్భగుడిలో ఇప్పటికీ విగ్రహం లేదు.

వాచ్ టవర్..

కోట ప్రధాన ద్వారం చాలా పెద్దవి. వాటిని తెరిచి మూయడానికి అప్పట్లో ఏనుగులను వాడేవారట. శత్రువుల ఏనుగులు వచ్చి తలుపులను ఢీకొనకుండా అప్పట్లోనే ఆ తలుపులకు సూది మొనల్లా ఉన్న ఇనుప గుబ్బలను ఏర్పాటు చేశారు. తలుపులు తీయకుండా లోపలికి, బయటకు వెళ్లేందుకు అనువుగా పక్కనే చిన్న ద్వారం కూడా ఏర్పాటు చేశారు. ఇలాంటి తలుపులు జిల్లాలో మరెక్కడా కనిపించవు. కోట లోపలికి వెళ్లగానే ఎత్తుగా వాచ్ టవర్

మిగతా 6వపేజీలో..

సైబర్ భూతాలు



- 11 నెలల్లో రూ.42 కోట్లు కొట్టేశారు
- 2,182 కేసులు నమోదు
- జిల్లా అంతటా బాధితులే
- పరువుపోతుందని కొందరు ముందుకు రాని వైనం
- ఎన్‌ఫోర్స్‌మెంటు, సీబీఐ, ఇన్‌కంట్యాక్స్ అధికారులపేరుతో డిజిటల్ అరెస్టులు
- ఇన్వెస్ట్‌మెంటు పేరుతో దోపిడీ
- వలపు వలతో వీడియోకాల్ చేసి బురిడీ
- పెరిగిపోతున్న సైబర్ నేరాలు
- బాధితులంతా విద్యావంతులే
- ఆవిరైపోతున్న కోట్లాది రూపాయల కష్టార్జితం
- అప్రమత్తంగా ఉంటేనే మోసాలకు చెక్

ఎక్కడుం టారో తెలియదు.. కంటికి కనబడరు.. బ్యాంకు దోపిడీలకు పాల్పడరు.. ఇంట్లో చొరబడరు.. చైన్‌స్నాచింగ్‌లు చేయరు.. మారణాయుధాలతో దాడి చేయరు.. కానీ ఇతరుల కష్టార్జితం మొత్తం కొల్లగొట్టేస్తారు. దోపిడీ దొంగలు కొంత మొత్తాన్నే కొట్టేస్తారు. అయితే కంటికి కనబడని సైబర్ ఉగ్రభూతాలు మాత్రం.. లక్షలు కాదు.. కోట్ల రూపాయలు దోచుకుంటారు. నిరక్షరాస్యులో తెలియని మహిళలో మోసపోయారంటే ఏదోలే అనుకోవచ్చు. సైబర్ ఉగ్రభూతాల ఉచ్చులో విద్యావంతులే చిక్కుకోవడం గమనార్హం. అందులోనూ ఉన్నత విద్యావంతులు చిక్కుకుని డబ్బులు పోగొట్టుకుని విలవిల్లాడుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటి వరకు సైబర్ నేరగాళ్లు రూ.42 కోట్లు కొల్లగొట్టేశారు.

(కడప-ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోను మనిషి దైనందిన జీవితంలో ఒక భాగమైపోయింది. ఇంటర్నెట్ వినియోగం పెరిగింది. నగదు చెల్లింపులన్నింటికీ స్మార్ట్‌ఫోన్లపై ఆధారపడిపోయాం. అంతే.. టెక్నాలజీని ఒడిసిపట్టుకున్న సైబర్ నేరగాళ్లు కంటికి కనిపించకుండా జనం సొమ్మును నొక్కేస్తున్నారు. ఎంతలా అంటే జిల్లాలో పోలీసుల లెక్కల ప్రకారం ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.42 కోట్లను కొట్టేశారు. 2182 కేసులు నమోదయ్యాయంటే సైబర్ ఉగ్రభూతం పీడ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ మోసపోయేవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇప్పటి వరకు బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం, మీ అకౌంటు డీయాక్టివేట్ అయింది, ఆధార్, ఓటీపీ నెంబరు చెప్పమని కొందరు మోసం చేస్తుండగా.. ఇప్పుడు కొత్తగా డిజిటల్ అరెస్టులు ఎక్కువయ్యాయి. ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులమని, సీబీఐ అని బెదిరించి మొబైల్ వీడియోకాల్‌లోనే కోర్టులో విచారణ చేయించి బాధితున్ని ఉక్కిరిబిక్కిరి చేసి కోట్లు కొట్టేస్తుండడం కలవరపెట్టే అంశం.

కడప, ప్రొద్దుటూరులో అత్యధికమంది

జిల్లా అంతటా సైబర్ నేరగాళ్ల బాధితులు ఉన్నారు. వీరి బారిన ఉన్నత ఉద్యోగస్తులు, డాక్టర్లు, హై ప్రొఫైల్స్ కలిగిన ఎక్కువగా ఉంటున్నారు. హై ప్రొఫైల్ ఉన్న అధికారులు, డాక్టర్లనుంచి డిజిటల్ అరెస్టు పేరుతో కోట్లు దోచుకుంటే.. షేర్ మార్కెట్ పేరుతో మరికొందరి నుంచి నొక్కేస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో మీకు బ్యాంకురుణం వచ్చింది.. ఓటీపీ చెప్పండి అని చెబుతూ బురిడీ కొట్టించి క్షణాల్లో డబ్బులు మాయం చేస్తున్నారు. జిల్లాలో 52 పోలీసుస్టేషన్లు ఉన్నాయి. ఒక్క బి.మఠం తప్ప అన్ని స్టేషన్లలో సైబర్ కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 2182 మందిని మస్కాకొట్టి సైబర్ ఉగ్రవాదులు రూ.42 కోట్లు కొట్టేశారు. అయితే సకాలంలో కొందరు ఫిర్యాదు చేయడంతో సైబర్ ఉగ్రవాదులు కొట్టేసిన రూ.4కోట్లను డ్రా చేయనివ్వకుండా పోలీసులు హోల్డ్ చేశారు. ఇక కేసుల పరంగా చూస్తే కడప, ప్రొద్దుటూరులోనే ఎక్కువగా నమోద య్యాయి. కడప సబ్ డివిజనులోనే 1,097 కేసు లు నమోదయ్యాయి. దాని తరువాత ప్రొద్దుటూరులో 300కు పైగా కేసులు నమోదయ్యాయి.

కొన్ని ఉదాహరణలు..

- ప్రొద్దుటూరుకు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగికి వీడియోకాల్ వచ్చింది. ఆ కాల్ ఎత్తిన తరువాత ఫోను కట్ చేసి అతను న్యూడ్‌గా ఉన్న మహిళను చూస్తున్న వీడియో పంపించి బ్లాక్‌మెయిల్‌కు దిగారు. డబ్బులు ఇస్తావా లేదంటే దీనిని మీ కుటుంబ సభ్యులకు సోషల్ మీడియాలో పెట్టమంటావా అని బెదిరిండచంతో భయపడ్డ ఆ ఉద్యోగి రూ.3లక్షలు చెల్లించారు. అయినా కూడా నేరగాళ్లు వదల్లేదు. ఇంకా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూనే ఉన్నారు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించాడు.
- రాయచోటికి చెందిన ఓ ప్రైవేటు డాక్టరుకు ఫోనుచేశారు. మేం బాంబే నుంచి కస్టమ్స్ అధికారులం మాట్లాడుతున్నాం. మీ పేరిట ఓ పార్శల్ వచ్చింది. అందులో మత్తు పదార్థాలున్నాయి. మిమ్మల్ని అరెస్టు చేయడానికి మా బృందాలు అక్కడికి వచ్చాయి అని భయపెట్టి రూ.2.50 కోట్లు కొట్టేశారు.
- కడపలోని ఓ ఇంజనీరు అధికారికి సైబర్ ముఠా ఫోను చేసింది. మేం సీబీఐ నుంచి మాట్లాడుతున్నాం. మీపై కేసు నమోదైంది. ఇతర ప్రాంతాల నుంచి మీ ఖాతాలో నగదు జమ అయింది. ఈ కేసు మాకు అప్పగించారు అంటూ అతని ఆధార్‌నెంబరు, పాస్‌పోర్టు వివరాలు తెలిపారు. ఇవి మీవేనా అన్నారు. ఔనని ఆ అధికారి సమాధానం చెప్పారు. సరే మేం చెప్పిన వివరాలు ఇవ్వు, మ్యాచ్ అయితే మీరు సేఫ్ అంటూ వ్యక్తిగత వివరాలు అడిగారు. ఒక లింకు పంపించారు. సీబీఐ, ఈడీ కేసులని భయపడిపోయిన ఆయన ఆ లింకులో వారడిగిన సమాచారం అంతా పంపారు. అంతే.. ఖాతాలో రూ.2.34 కోట్లు కొట్టేశారు.
- కడప నగరానికి చెందిన ఓ అధికారి ఈ ఏడాది జనవరిలో రిటైర్ అయ్యారు. కొడుకు కోడలు వద్ద ఉంటున్నారు. ఆయనకు ఓ ఫోనుకాల్ వచ్చింది. మేం ముంబైలోని నార్కోఅనాలసిస్ నుంచి మాట్లాడుతున్నాం మీ పేరిట డ్రగ్స్ సరఫరా అయ్యాయి. మీపై కేసు నమోదు అయింది. ఇప్పటికే సిబ్బంది మీఇంటిని చుట్టుముట్టారంటూ ఆయనను బెదిరించారు. వాళ్లున్న నార్కో ఆఫీసు కార్యాలయాన్ని వీడియో కాల్‌లో చూపించారు. బయట పడకుండా సెటిల్ చేసుకుందాం అంటూ భయపెట్టారు. ఎక్కడ పరువుపోతుందో అని ఆ డాక్టరు వ్యక్తిగత వివరాలు ఇవ్వడంతో ఆయన ఖాతాలో రూ.50లక్షలు దోచేశారు.
- కడపలోని మరో వైద్యునికి ఈడీ అధికారులమంటూ కాల్ వచ్చింది. మీ ఖాతాలోకి విదేశీ నిధులు వచ్చాయి. నిబంధనల మేరకు మీ బ్యాంకు వివరాలు చెబితే ఒకే.. మీపై కేసులు ఉండవు. అంటూ చెప్పుకొచ్చారు. అన్ని వివరాలు చెప్పడంతో.. ఆయన ఖాతాలోంచి రూ.50లక్షలు కొట్టేశారు.

అచ్చం సీబీఐ, ఈడీ అధికారుల మాదిరిగానే..

సైబర్ ముఠాలో ఎక్కువ మంది ఉత్తర భారతదేశానికి చెందినవారు. హైట్, వెయిట్ ఫిజిక్ పర్‌ఫెక్ట్‌గా సీబీఐ, ఈడీ అధికారుల మాదిరిగా ఉంటారు. దీనికి తగ్గట్లు ఇంగ్లీషు, హిందీ, తెలుగు భాషలు కూడా అనర్గళంగా మాట్లాడతారు. వారున్న చోట అచ్చం పోలీసుల మాదిరిగానే ఈడీ, సీబీఐ, నార్కోటిక్స్ కస్టమ్స్ అధికారుల కార్యాలయాలను తలపించే విధంగా సెట్టింగ్ వేసి వాట్సప్ వీడియోకాల్ ద్వారా వాటిని చూపించి బెదిరించి కోట్లు స్వాహా చేసేస్తున్నారు.



అప్రమత్తత అవసరం..

టెక్నాలజీ ఉపయోగించి నేరగాళ్లు రకరకాల పద్ధతులతో మోసాలకు పాల్పడుతున్నారు. ఎవరైనా మీకు ఫోను చేసి మీ వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పవద్దు. పోలీసులమని అపరిచిత వ్యక్తులు వీడియోకాల్ చేస్తే మీ ముఖం వారికి చూపించవద్దు. వీడియో కాల్స్ మాట్లాడుతూ లింకు పంపితే అది ఓపెన్ చేయవద్దు. మిమ్మల్ని ఎవరైనా బ్లాక్‌మెయిల్ చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయండి. సైబర్ నేరగాళ్లు లోకల్‌గా ఉన్న వారిని ఎంపిక చేసుకుని వారికి డబ్బులు ఇచ్చి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో లింకులు పంపిస్తుంటారు. డిజిటల్ అరెస్టులే లేవు. పిన్‌నెంబర్లు ఎవరికీ చెప్పవద్దు. వీడియోకాల్ ద్వారా మీపై వల వేస్తారు. సీబీఐ, ఈడీ, నార్కో అధికారులమని ఫోను చేసినా భయపడవద్దు. వెంటనే మీరు సైబర్‌కాల్ సెంటరు 1930కి కాల్ చేయండి. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయండి.

- మధుమల్లేశ్వర్‌రెడ్డి, కడప సైబర్‌సెల్ ఇన్‌స్పెక్టర్

బడుగులకు రక్షణగా ప్రజాన్యాయపీఠం

- న్యాయసేవాధికార దినోత్సవంలో జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయసేవలు అందిస్తూ ప్రజాన్యాయపీఠం (న్యాయసేవాధికార సంస్థల చట్టం) రక్షణగా నిలుస్తోందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం న్యాయసేవాధికార దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీకి ప్రధాన జడ్జి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డీఎల్ఎస్ఏ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన జడ్జి మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయసేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఏడాది నవంబర్ 9న న్యాయ సేవల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, వికలాంగులు, షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాలు, పిల్లలు, మానవ అక్రమ రవాణా బాధితులు, ప్రకృతి వైపరీత్యాల బాధితులకు ఉచిత న్యాయసేవలను అందిస్తున్నామన్నారు. జిల్లా, మండల న్యాయసేవాధికార సంస్థల ద్వారా జిల్లా అంతటా విరివిగా న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించి ఉచిత న్యాయసహాయం అందిస్తున్నామన్నారు. షెల్టర్ హోమ్‌లు, ఓల్డేజ్ హోమ్‌లు, చిల్డ్రన్స్ హోమ్‌లు, వెల్ఫేర్ హాస్టళ్ల విజిట్ చేసి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల రక్షణపై విరివిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మరింతగా న్యాయసేవలను అందించేందుకు జాతీయ న్యాయసేవాధికార సంస్థ నేషనల్ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్ 15100 పై అవగాహహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన జడ్జితో పాటు డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్, పలువురు జడ్జిలు, న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు, ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు.

7 9మంది ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి అవార్డులు

దొంగతనానికి వెళ్తే కాలు పోయింది..



7

టీడీపీ శ్రేణుల్లో నిరుత్సాహం

- నామినేటెడ్ పోస్టుల్లో జిల్లాకు దక్కని చోటు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండోసారి నామినేటెడ్ పోస్టుల పంపకం జరిగింది. ఈ సారి రాష్ట్రవ్యాప్తంగా 59 మంది టీడీపీ, బీజేపీ, జనసేనకు చెందిన వారికి పదవులు కట్టబెట్టారు. అయితే శనివారం ప్రకటించిన రెండో జాబితాలో జిల్లాకు చోటు దక్కకపోవడం చూసి కూటమి శ్రేణులు నిరుత్సాహానికి గురయ్యారు. ముఖ్యంగా పదవులపై ఆశలు పెట్టుకున్న టీడీపీ నేతలు డీలా పడ్డారు.

(కడప - ఆంధ్రజ్యోతి): నిన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమి అభ్యర్థులుగా పోటీ చేశారు. జనం కూడా కడప పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను ఐదు స్థానాలను కట్టబెట్టారు. ఇక ఎన్నికల సమయంలో పలువురు అసెంబ్లీ టికెట్లు ఆశించారు. కొందరు ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. అయితే రాజకీయ సమీకరణలో భాగంగా పలువురికి టికెట్లు దక్కలేదు. అలాంటి వారికి తాము అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని అధిష్టానం హామీ ఇచ్చిందని చెబుతారు. కడప అసెంబ్లీ ఇన్‌చార్జిగా వీఎస్ అమీర్‌బాబు పనిచేశారు. కడప టికెట్‌పై ధీమాతో అలంఖాన్‌పల్లెకు చెందిన లక్ష్మిరెడ్డి కుటుంబం పనిచేసింది. చివరికి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధవీకి టికెట్ ఇచ్చారు. ఆమె గెలిచారు. కడపలో వీరిద్దరితో పాటు పార్టీని నమ్ముకున్న ఎస్.గోవర్ధనరెడ్డి, బి.హరిప్రసాద్‌తో పాటు పలువురు పదవులు ఆశించారు. ఇక ప్రొద్దుటూరులో టీడీపీ ఇన్‌చార్జ్‌గా పనిచేసిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి టికెట్ దక్కలేదు. అతను రెండుసార్లు జైలుకెళ్లారు. నామినేటెడ్ పదవి వస్తుందని ఆశించారు. జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి జమ్మలమడుగు నుంచి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే బలవంతంగా కడప ఎంపీగా ఆయనను నిలబెట్టారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయినా పదవిపై ఆశలు పెట్టుకున్నారు. వీరితో పాటు పలువురు పదవులపై ఆశలు పెట్టుకుంటే రెండో విడతలోనూ వీరికి చోటు దక్కలేదు. అయితే ఇంకా చాలా పదవులు ఉండడంతో మూడో విడతలో మళ్లీ అవకాశం వస్తుందని ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఏదిఏమైనా రెండో జాబితాతో టీడీపీ శ్రేణులు డీలాపడ్డాయని చెప్పవచ్చు.

నేను తప్పుచేయలేదు..

- దేవునికడప ఆలయంలో సురేశ్‌బాబు ప్రమాణం



వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రమాణం చేస్తున్న మేయరు సురేశ్‌బాబు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): "నేను తప్పుచేయలేదు, చేసినట్లయితే నన్ను శిక్షించు.. లేకుంటే నిందారోపణలు చేసిన వ్యక్తిని, కుటుంబాన్ని శిక్షించాలని దేవున్ని మనసారా కోరుకుంటున్నా" అని మేయరు సురేశ్‌బాబు దేవుని కడప వెంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం ప్రమాణం చేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి హాజరయ్యారు. అనంతరం మేయరు మాట్లాడుతూ తనపై ఆరోపణలు చేసిన వారికి సవాలు చేస్తున్నా.. ఎమ్మెల్యే ఎన్నికల్లో రూ.3కోట్లు తీసుకున్నానని నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తామన్నారు. కార్పొరేషన్ ఎదుట ఒక మాట, తరువాత మరో మాట మాట్లాడి శ్రీనివాసరెడ్డి యూటర్న్ తీసుకున్నాడని చెప్పారు. గత 35 ళ్లగా ఒకే కుటుంబాన్ని నమ్ముకున్నానని, వారి వెంటే ఉన్నామన్నారు. వారిలాగా కాంగ్రెస్, టీడీపీ, కాంగ్రెస్, టీడీపీ ఇలా పార్టీలు మారుతూ ఊసరవెల్లి రాజకీయాలు చేయలేదన్నారు. దమ్ముంటే తన చాలెంజ్‌ను శ్రీనివాసరెడ్డి స్వీకరించాలన్నారు.

నేటి నుంచి కడపలో.. అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

6

- సిద్ధమైన డీఎస్ఏ స్టేడియం
- ర్యాలీకి 13 జిల్లాల నుంచి 4,000 మంది అభ్యర్థుల రాక
- ప్రతీ రోజు 800 మందికి స్క్రీనింగ్ టెస్ట్



ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ కోసం కడపలోని డీఎస్ఏ స్టేడియంలో చేసిన ఏర్పాట్లు



అపురూప చరిత్ర.. గండికోట



● సహజసిద్ధంగా ఏర్పడ్డ పెన్నాలోయ ● ఆకట్టుకుంటున్న మాధవరాయ స్వామి ఆలయ గోపురం ● ఇప్పటికీ చెక్కుచెదరని శిల్పసంపద ● పర్యాటకులను ఆకర్షిస్తున్న మహాదుర్గం


గండికోట ముఖద్వారం


గండికోటలోని రంగనాథస్వామి ఆలయం

(5వపేజీ తరువాయి)

దర్శనమిస్తుంది. 16వ శతాబ్దంలో అప్పటి నవాబులు దీనిని నిర్మించారు. శత్రువుల రాకపోకలను దాని పైకి ఎక్కి దూరం నుంచి చూసే సౌకర్యం కోసం ఏర్పాటు చేశారు. 400 సంవత్సరాలు అయినా నేటికీ చెక్కుచెదరలేదు. అప్పట్లో తప్పు చేసిన ఖైదీలకు వివిధ రకాల శిక్షలు ఉండేవి. శిక్ష పడిన వారిని నిర్బంధించేందుకు విడిగా కారాగారం ఉంది.

ఆకట్టుకుంటున్న మాధవరాయస్వామి ఆలయం

కోట లోపల గల మాధవరాయస్వామి ఆలయ రాజగోపురం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇప్పటికే అక్కడ చాలా సినిమాలు, షూటింగ్‌లు కూడా జరిగాయి. అప్పట్లో శత్రువుల దాడిలో కొద్ది భాగం ధ్వంసమైంది. గోపురం కింద గల ద్వారం పైన ఇటు లోపలికి వెళ్లేవారికి, అటు లోపల నుంచి బయటికి వచ్చేవారికి స్వాగతం చెబుతున్నట్లుగా నృత్య భంగిమల చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. వెయ్యేళ్ల కిందటి నాటి సంస్కృతి సంప్రదాయాలను ఆ శిల్పాల్లో నేటికీ చూడవచ్చు. గోపురం లోపల రెండు వైపులా అద్భుతమైన శిల్ప సంపద కనిపిస్తుంది. ఇనుప స్వభావం గల పెద్ద పెద్ద రాతిబండల స్తంభాలతో ఉన్న ఆ ఆలయం ఎంతటి ఎండలో అయినా చల్లగా ఉండటం విశేషం. దానిని దాటి లోపలికి వెళ్లామంటే విశాలమైన హాలులో మండపం ఉంది. అందులో కళాప్రదర్శనలు జరిగేవి. అంతేకాకుండా ఏదేని వివాదాలు, వాటి విచారణలు కూడా అక్కడే జరిగేవి. గండికోట లోపల మరో విశేషం రంగనాధస్వామి ఆలయం. ఆలయం అన్ని వైపులా అపురూపమైన శిల్పసంపద దర్శనమిస్తుంది. ఆలయం లోపల వైష్ణవ సంప్రదాయం ప్రకారంగా ముఖమండపం, రంగమండపం, అంతరాలయం, గర్భాలయం, యాగశాల దర్శనమిస్తాయి. ప్రధానంగా రంగమండపంలో కూడా ప్రతి స్తంభంలో అద్భుతమైన శిల్పాలు చెక్కారు.

ఆశ్చర్యంగొల్పే శిల్పుల నైపుణ్యం

కోటలోపల గల మాధవరాయస్వామి ఆలయంలో ఒక శిల్పం నేటికీ పర్యాటకులకు ఆశ్చర్యం కలిగిస్తుంటుంది. ఆ శిల్పం ఓ వైపు నుంచి చూస్తే వృషభంలా, మరో వైపు నుంచి ఏనుగులా కనిపిస్తుంది. వాటి రెండింటికీ గల శరీరాలు వేరుగా ఉంటూనే తల మాత్రం ఒకటిగానే ఉంటుంది. ఏనుగు తలను మూసి చూస్తే ఎద్దులా కనిపిస్తుంది, ఎద్దు తలను మూసి చూస్తే ఏనుగులా కనిపిస్తుంది. అప్పట్లోనే నాటి శిల్పుల చాతుర్యాన్ని దీనిని చూస్తే అర్థమవుతుంది.

పటిష్టంగా నేటికీ వసారా

ఆలయం వెనుక గల మూడు వైపులా వసారా గదులు నేటికీ పటిష్టంగానే దర్శనమిస్తున్నాయి. ప్రాకారం లోపల (పాకశాల - వంటశాల ఆలంకార శాల) ఉన్నాయి. వెనుకభాగాన కల్యాణ మండపం, ఉత్తరం వైపున ఆళ్వార్ల మండపాలు ఉన్నాయి. చుట్టూ మూడువైపులా మొత్తంగా 56 స్తంభాల వసారా ఉంది. అన్ని స్తంభాలతో పాటు పైకప్పులో కూడా శిల్పాలు దర్శనమిస్తాయి.

అందమైన ఆకృతిలో జుమ్మామసీదు

గండికోట లోపల ఉత్తరం వైపున అందమైన జుమ్మా మసీదు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మసీదు లోపల 64, వెలుపల 32 గదుల వసారాలు ఉన్నాయి. వెలుపల గదిలో గుర్రాలను అప్పట్లో ఉంచేవారు. లోపల సైనికులు, సామంతరాజులు సభ చేసేవారు. రాజపీఠం స్థానంలో అందమైన మసీదు నిర్మించారు. ఎత్తయిన అరుగుపై ఉజూఖానా కూడా ఉంది. ఉత్తరం వైపు దిశగా వెళితే మసీదు పైకి మెట్లు ఉన్నాయి. ఎదురుగా నిలబడి మసీదును చూస్తే హైదరాబాదులో గల చార్మినార్ గుర్తుకు వస్తుంది.

ఇలా చేరుకోవచ్చు..

గండికోట జమ్మలమడుగు పట్టణానికి 14 కి.మీ దూరంలో ఉంది. కడప నుంచి కానీ, ప్రొద్దుటూరు నుంచి కానీ జమ్మలమడుగు వెళ్లి అక్కడి నుంచి గండికోట చేరుకోవచ్చు. గండికోట నుంచి ఆటోలు ఉంటాయి.

కత్తుల కోనేరు

జుమ్మామసీదుకు ఎదురుగా కోనేరు ఉంది. దీనిని కత్తుల కోనేరు అంటారు. యుద్ధాలు చేసి వచ్చాక సైనికులు ఇక్కడ కత్తులను శుభ్రం చేసుకునే వారని అంటారు. ఇప్పటికీ కోనేరులో నీళ్లు ఉన్నాయి.

పటిష్ట ధాన్యాగారం


జుమ్మా మసీదుకు పక్కనే ధాన్యాగారం ఉంది. దీనిని 12 స్తంభాలతో పటిష్టంగా నిర్మించారు. గండికోటను పాలించిన రాజుల్లో ఒకరైన మీర్‌జుమ్లా 16వ శతాబ్దంలో ఆ భవనాన్ని అత్యంత సుందర ధాన్యాగారంగా నిర్మించారు. ధాన్యం బస్తాలను సులభంగా తీసుకోవడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అప్పట్లోనే ఏర్పాటు చేసుకున్నారు. అందులో ఉంచిన ధాన్యం రెండేళ్ల పాటు పాడవకుండా ఉండేలా నిర్మించడం విశేషం. దాని పైకి వెళ్లడానికి ఉత్తరం వైపు నుంచి మెట్లు అమర్చారు. పై నుంచి చూస్తే జుమ్మామసీదు, కోటలోని మరికొన్ని ప్రాంతాలు కనిపిస్తాయి.

కొండను రెండుగా చీలుస్తూ.. పెన్నానది

ఆలయం పక్కనే పెన్నాలోయ ఉంది. దీనినే గండికోట లోయ అని కూడా అంటారు. రెండు కొండలను చీలుస్తూ పెన్నా నది ప్రవహిస్తుంటుంది. వాస్తవానికి ఇక్కడ నదిలో నీళ్ల వేల సంవత్సరాలుగా ప్రవహించడం వలన కోతకు గురై అటు ఇటు కొండలుగా.. లోయలో నది ఉన్నట్టు ఉంటుంది. ప్రపంచంలో ఇలాంటి ప్రదేశం అమెరికాలోని గ్రాండ్ కెనాన్ మినహా మరెక్కడా లేదు. ఇలాంటి అద్భుతమైన లోయ ప్రపంచంలో ఇది రెండోది. అదుకే దీనిని గ్రాండ్ కెనాన్ ఆఫ్ ఇండియా అంటారు. ఈ ప్రాంతం పర్యాటకంగా ప్రాచుర్యంలోకి రావడానికి కూడా లోయే కారణం.


రోప్‌వే ఏర్పాటు చేస్తే..


గండికోట పెన్నానది లోయ అందాల సొగసులను మరింత ఆస్వాదించేందుకు అనువుగా రోప్‌వే సౌకర్యం కల్పిస్తే పర్యాటకుల సందడి మరింత పెరిగే అవకాశం ఉంది. తద్వారా ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరే సౌలభ్యం ఉంటుంది. ఆ దిశగా పాలక ప్రభుత్వాలు స్పందించి రోప్‌వే సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక్కడ బస చేయడానికి హరిత రెస్టారెంట్ ఉంది. ఇటీవల కొన్ని ప్రైవేటు గెస్ట్ హౌస్‌లు ఏర్పాటు చేశారు.


గుర్రాలశాల


కత్తుల కోనేరు


ధాన్యాగారం


మాధవరాయస్వామి ఆలయం


కొండను రెండుగా చీలుస్తూ ప్రవహిస్తున్న పెన్నానది

విద్యార్థుల స్కూల్ రికార్డులు సరిదిద్దే

అధికారం బదలాయింపు

ఇక నుంచి డీవైఈవో, ఎంఈవో, హెచ్‌ఎంలకు అధికారం

కలికిరి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్కూల్ రికార్డుల్లో తప్పులను లేదా సవరణలు చేసే అధికారాన్ని స్థానిక డిప్యూటీ విద్యా శాఖాధికారి (డీవైఈవో), ఎంఈవోలు, హెడ్మాస్టర్లకు బదలాయిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరు విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇలాంటి సవరణల ఆమోదం తెలిపే అధికారం జిల్లా విద్యా శాఖాధికారులు, రీజినల్ జాయింట్ డైరెక్టర్లకు మాత్రమే ఉండేది. 'ఒకే దేశం.. ఒకే విద్యార్థి' అన్న నినాదంతో 'అపార్' ఐడీలు జారీ చేస్తున్న విషయం తెలిసింది. ఈ ఐడీల జారీ కోసం పాఠశాలల రికార్డుల్లో విద్యార్థులకు సంబంధించిన పలు అంశాలపై తప్పులు చోటు చేసుకున్నాయి. వీటిని సవరిస్తేగానీ ఆధార్ సవరణలకు వీలుకాదు. పూర్తి పక్కా సమాచారంతో ఆధార్ అప్‌డేట్ జరిగితే అపార్ ఐడీ జారీ సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో స్కూల్ రికార్డుల్లో సవరణలను ఆమోదించుకోవడం కోసం డీఈవో, ఆర్జేడీ కార్యాలయాలకు వెళ్లడం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భారంగా పరిణమించిందని డైరెక్టరు పేర్కొన్నారు. సవరణల ప్రక్రియను సులభతరం చేసేందుకు స్థానిక విద్యా శాఖ అధికారులకు సవరణలను ధృవీకరించే అధికారాన్ని బదిలీ చేసినట్లు తెలిపారు. 2025 మార్చి 31వ తేదీ వరకు మాత్రమే ఈ అధికారాన్ని పరిమితం చేస్తున్నట్లు డైరెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ విద్యార్థుల స్కూల్ రికార్డులను సరిచేయడానికి ఎంఈవోలకు అధికారం కల్పించారు. అదే ప్రభుత్వ, జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థుల రికార్డుల సవరణకు ఆయా హెడ్‌మాస్టర్లకు అప్పగించారు. ఇక మిగిలిన ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన వ్యవహారాలకు డీవైఈవోలకు అధికారం కల్పించారు. అయితే రికార్డుల సవరణల్లో ఏవైనా అవకతవకలతో తారుమారు జరిగినట్లయితే కఠిన చర్యలకు గురవుతారని కూడా ఈ ఉత్తర్వుల్లో హెచ్చరించారు.

అవినీతికి పాల్పడితే చర్యలు

● సచివాలయాలు, మీ-సేవ కేంద్రాల్లో తనిఖీ
● మున్సిపల్ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు
● మున్సిపల్ కమిషనర్ ప్రమీల చర్యలు



మున్సిపల్ మేనేజర్ మనోహర్‌తో చర్చిస్తున్న కమిషనర్ ప్రమీల, మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రం

మదనపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకొస్తున్న అపార్ ఐడీల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల సిబ్బందిని హెచ్చరించారు. 'బర్త్ సర్టిఫికెట్ల కోసం వసూళ్లు' అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనికి స్పందించిన మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఏఎస్‌వో వెంకటేష్‌నాయుడు తీవ్రంగా స్పందించారు. వసూళ్లపై అభియోగాలు, ఆరోపణలు వచ్చిన సచివాయాలు, మీ-సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. బర్త్ సర్టిఫికెట్ల సవరణ కోసం వచ్చే ప్రజలతో కమిషనర్ మాట్లాడారు. మరోవైపు సచివాలయాలకు నియమించిన నోడల్ ఆఫీసర్లను సాధారణ పౌరులుగా పంపించి వాకబు చేయించారు. ఇక్కడ ఒక్కో సర్వీసుకు ఎంత తీసుకుంటారు? ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషనర్‌తో పాటు నోడల్ ఆఫీసర్లు వేర్వేరుగా వారిని ఆరా తీశారు. ఒక్కో సర్వీసుకు నిర్ణీత రుసుం కంటే ఒక్క రూపాయి అదనంగా తీసుకున్నా తనకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. అలాగే మరోసారి ఇలాంటి ఫిర్యాదులు వస్తే అక్కడిక్కడే కఠినమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులను తీవ్రంగా హెచ్చరించారు. అలాగే మరికొందరు మీ-సేవా కేంద్రాల నిర్వాహకులను మున్సిపల్ కార్యాలయానికి పిలిపించి విచారించడంతో పాటు అభియోగం, ఫిర్యాదులు వచ్చిన వారిని తీవ్రంగా హెచ్చరించారు. అలాగే సచివాలయ అమ్యూనిటీ, డిజిటల్ అసిస్టెంట్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి ముఖ్యంగా జనన ధ్రువీకరణ పత్రంలో సవరణలను వెంటనే, అక్కడిక్కడే నమోదు చేసి పరిష్కరించాలని సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వం, కలెక్టర్ చాలా సీరియస్‌గా ఉన్నట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. మున్సిపాలిటీనే కాకుండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి చాలామంది వస్తున్నారని, వీరిని కొన్ని సచివాలయాలకే పరిమితం చేయకుండా, ఆయా పరిధిలోని అన్ని సచివాలయాలకు వెళ్లేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా శని, ఆదివారం కూడా పనిచేసేలా మున్సిపల్ కార్యాలయంలో కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పటికీ సమస్యలు ఉంటే జనన ధ్రువీకరణ పత్రాల సవరణకు మున్సిపల్ కార్యాలయంలోనే ప్రత్యేకంగా నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయాలని మేనేజర్ పి.ఆర్.మనోహర్‌కు సూచించారు. ఇందుకోసం శనివారం కార్యాలయానికి సెలవు అయినా ఆఫీసులో మేనేజర్‌తో సమావేశమై మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేయించారు.

నేటి నుంచి కడపలో

అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

● సిద్ధమైన డీఎస్‌ఏ స్టేడియం ● ర్యాలీకి 13 జిల్లాల నుంచి 4 వేల మంది అభ్యర్థుల రాక ● ప్రతిరోజు 800 మందికి స్ర్కీనింగ్ టెస్ట్

కడప స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశ సేవలో తరించేందుకు 'అగ్నివీరులు' కావాలని ఎదురుచూస్తున్న యువత లక్ష్యం చేరుకునే సమయం ఎట్టకేలకు ఆసన్నమైంది. ఆదివారం నుంచి 15వ తేదీ శుక్రవారం వరకు కడప నగరంలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్‌ఏ) మైదానంలో అత్యంత పకడ్బందీగా అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనుంది. అందుకు వీలుగా మైదానంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భరతమాత ముద్దుబిడ్డలు (సైనికులు)గా దేశం కోసం సేవలందించాలనే యువతకు ఈ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఒక గొప్ప అవకాశం అని చెప్పవచ్చు. ర్యాలీలో ఎంపిక కావాలనే ధ్యేయంతో ఇప్పటికే రన్నింగ్ ప్రాక్టీస్‌తో పాటు అందుకు అవసరమైన కసరత్తుతో ఇప్పటికే యువకులు సన్నద్ధమై ఉంటారు. ఏది ఏమైనా రిక్రూట్‌మెంట్ ర్యాలీలో తమను తాము నిరూపించుకోడానికి పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించక తప్పదు.

రోజు 800 మందికి స్ర్కీనింగ్ టెస్ట్

కడపలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి 13 జిల్లాల నుంచి సుమారు 4 వేల మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఆ మేరకు కడప జిల్లాతో పాటు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి హాజరు కానున్నారు. వీరిలో రోజుకు 800 మంది అభ్యర్థులకు స్ర్కీనింగ్ టెస్ట్ నిర్వహించేందుకు అనువుగా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ముందస్తుగా అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపించారు. వాటిలో పొందుపరచిన తేదీ... సూచించిన సమయానికి అభ్యర్థి తప్పనిసరిగా హాజరై రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అందులో ఏ రోజైతే కేటాయించారో అదేరోజు తప్పక హాజరుకావాలి. ఆరోజు హాజరుకాకపోతే ఇక ఎట్టి పరిస్థితిలోనూ ర్యాలీలో పాల్గొనడానికి అనుమతించరు.

వసతి, భోజన ఏర్పాట్లు సిద్ధం

ర్యాలీలో పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి ముందుగా వచ్చే అభ్యర్థులకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. వీరు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా గుడారాలు వేశారు. వాటిల్లో సేదతీరి ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొనవచ్చు. దూరం నుంచి ప్రయాణం చేసి ర్యాలీలో పాల్గొనే సమయానికి హాజరయ్యే అభ్యర్థులు అలసటకు గురయ్యే వీలుంది. ముందుగానే వచ్చి ఇక్కడ సేద తీరి ర్యాలీలో పాల్గొనవచ్చు. ఇదిలావుండగా కొంతమంది అభ్యర్థులకు అర్ధరాత్రి సమయంలో ర్యాలీ కేటాయించినట్లు తెలిసింది. అలాంటి అభ్యర్థులు ముందురోజు రాత్రికే కడప చేరుకోవడం ఉత్తమం. అలాంటి వారిని దృష్టిలో ఉంచుకుని భోజన వసతిని ఏర్పాటు చేశారు.

దళారులను నమ్మి మోసపోకండి

అత్యంత ప్రతిష్టాత్మకంగా కడపలో చేపడుతున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇందులో పాల్గొనే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాం. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పే దళారులను నమ్మి మోసపోకండి.

- పునీత్‌కుమార్, ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్

మెయిన్ గేట్ వద్దే రిజిస్ట్రేషన్

ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులు ముందస్తుగా వారి తాలూకు వివరాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియను డీఎస్‌ఏ మైదానం మెయిన్ గేట్ కుడివైపున ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో చేయనున్నారు. తదుపరి ఆర్మీ అధికారుల సూచనలను పాటించాల్సి ఉంటుంది.

ఇండోర్ స్టేడియంలో మెడికల్ టెస్ట్

ఆర్మీ ర్యాలీలో నిర్వహించిన అన్ని పరీక్షలలో విజయవంతంగా ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అక్కడే ఉన్న ఇండోర్ స్టేడియంలో మెడికల్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులు ఏదేని అస్వస్థతకు గురైనా, లేదా గాయాలపాలైనా అక్కడే ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో సేవలందిస్తారు.

ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు బస ఏర్పాటు

ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థుల సౌకర్యం కోసం కలెక్టరు శ్రీధర్ ఆదేశాల మేరకు శంకరాపురం వద్ద ఉన్న స్కాట్ హాలులో బస ఏర్పాటు చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



రిక్రూట్‌మెంట్ ర్యాలీ కోసం డీఎస్‌ఏ స్టేడియంలో చేపట్టిన ఏర్పాట్లు, ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్మీ అధికారులు

చేనేత కార్మికుడి ఆత్మహత్య


మృతుడు హరి (ఫైల్)

మదనపల్లె అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలోని మారుతీనగర్‌లో ఉంటున్న చేనేత కార్మికుడు తాను నేసే చేనేత మగ్గానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల మేరకు సత్యసాయి జిల్లా సోమందేపల్లెకి చెందిన సి.హరి (45) కొన్నేళ్లుగా మదనపల్లెకు వలసవచ్చి నీరుగట్టువారిపల్లెలో చేనేత మగ్గాల యాజమాని వద్ద కూలీ మగ్గం నేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది తాను నేసే మగ్గానికే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు, ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కొడుకు చరణ్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

● చెరువును పరిశీలించిన తహసీల్దార్


చెరువులో ఇసుక గుంతలను పరిశీలిస్తున్న తహశీల్దార్

గుర్రంకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తరిగొండ రా మానాయునిచెరువులో ఇసుకను టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లతో అ క్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని శనివారం తహ సీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'రెచ్చిపోతున్న ఇసుక మాఫియా' అన్న శీర్షిక ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన తహసీల్దార్ రామానాయుని చెరువులో ఇసుక తవ్వకాలను పరిశీలించారు.

చెరువులో ఇసుక కోసం ఇసుకాసురులు ఎక్స్‌కవేటర్లతో తవ్విన ఇసుక గుంతలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామానాయుని చెరువులో ఇసుకను ప్రజలు, స్థానికులు తమ వ్యక్తిగత అవసరాల కోసం మాత్రమే తోలుకోవాలన్నారు. అలాకాకుండా ఎక్స్‌కవేటర్లు పెట్టి టిప్పర్లతో ఇసుకను బయట ప్రాంతాలకు తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇందుకోసం ప్రతిరోజూ వీఆర్‌ఏను చెరువు వద్ద కాపలాగా ఉంచుతున్నట్లు తెలిపారు. ఇసుకాసురుల అగడాలను ఉపేక్షించమని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి నుంచి విద్యార్థులు డిశ్చార్జి

వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే ఆది ఆర్థిక సహాయం



ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతున్న వర్షిణి

కొండాపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండాపురం గురుకుల పాఠశాల విద్యార్థినులు శనివారం సాయంత్రం డిశ్చార్జి అయినట్లు ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి తెలిపారు. సోమవారం తెల్లవారుజామున గదిలో నిద్రిస్తున్న వర్షిణి, పల్లవి పాముకాటుకు గురైన సంగతి తెలిసిందే. వర్షిణిని ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించగా, పల్లవిని కడప రిమ్స్‌లో చేర్చారు. వర్షిణి పరిస్థితి కొంత సీరియస్‌గా ఉండడంతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందిచాలని డాక్టర్‌ఖ/సూచించారు. విద్యార్థుల తల్లి దండ్రులకు ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల నిమిత్తం తక్షణమే రూ.50 వేలు అందించి మిగిలిన డబ్బు కూడా చెల్లిస్తానని తెలిపారు. ఆరు రోజుల చికిత్స అనంతరం కోలుకోవడంతో ఇద్దరు విద్యార్థులను శనివారం సాయింత్రం వైద్యులు డిశ్చార్జి చేశారు. ఆరు రోజల పాటు వర్షిణి దగ్గరే ప్రిన్సిపాల్ ఉండి పర్యవేక్షించినట్లు తెలిపారు. విద్యార్థులు క్షేమంగా బయటపడటానికి సహకరించిన ఎమ్మెల్యేకి విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే అవమానిస్తారా

- టీడీపీ నేత హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యేను అవమానిస్తారా అంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేయరు మహిళలను కించపరిచేలా వ్యవహరించారన్నారు. కొత్తగా ప్రొటోకాల్ డ్రామాకు తెరలేపారన్నారు. గతంలో వైసీపీ ఎమ్మెల్యేలను పక్కన కూర్చోబెట్టుకుని ఇప్పుడు ప్రొటోకాల్ అనడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీలో ఒక పెద్దమనిషి ఎన్నికల్లో డబ్బు తీసుకున్నాడని చెబితే మేయరు ఎందుకు దేవుని కడపలో ప్రమాణం చేశారని ప్రశ్నించారు. సమావేశంలో అఖిలపక్షం నేతలు శ్రీనివాసులు, ప్రసాద్, సుబ్బారెడ్డి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణం దృశ్యం

కడప కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడపలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తిరుమలేసుడు శ్రీదేవి, భూదేవి సమేతుడై కొలువుదీరి అత్యంత సుందరాకారుడుగా భక్తులకు దర్శనమిచ్చారు. కాగా కళ్యాణం సందర్భంగా చెన్నై నివాసి జె. ప్రసన్న వెంకటేశ్వరరావు స్వామివారికి సుమారు 92,280 రూపాయల విలువైన ఒక కేజీ నలభై గ్రాముల వెండి వస్తువులు.(నాలుగు తీర్థపు గిన్నెలుగా మరో నాలుగు ఉద్ధరిని) బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, అర్చకులు క్రిష్ణమోహన్, త్రివిక్రమ్, సాయి, తరుణ్, భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు.

ఎస్టీయూ నేత బాల మల్లారెడ్డి మృతి



కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుపరిచితులు గాంధీనగర్ హైస్కూలు హిందీ ఉపాధ్యాయుడు, ఎస్టీయూ ఉద్యమ నేత బాలమల్లారెడ్డి శనివారం మృతి చెందారు. 30 ఏళ్ల హిందీ పండితుడు, కడప నగ రం ఎర్రముక్కపల్లె వాసిగా గత తరం విద్యార్థినీ విద్యార్థుల కు చక్కని విద్యాబోధన చేశారన్నారు. కఠినమైన హిందీభాషను సరళంగా నేర్పిన ఉత్తమ గురువు, తోటి ఉపాధ్యాయులకు హితైషిగా పేరు పొందారన్నారు. శనివారం ఆయన అ నారోగ్య కారణంగా వల్ల స్వర్గస్తులయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ అటు ఉపాధ్యాయునిగా ఎస్టీయూ సంఘం బాధ్యుడిగా ఆయన పనితీరు గుర్తు చేసుకుంటూ ఎస్టీయూ సంఘం, ఉపాధ్యాయ మిత్రుల తరపున ఆయనకు అశ్రునివాళులర్పిస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని శిష్యబృందం కొరివి చంద్రశేఖర్, హరినాథ్‌రెడ్డి, తిరుపతి సీఐ శ్రీకాంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు తొండూరు మండలం అగడూరులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు శిష్యబృందం తెలిపింది.

చోరీకి వెళితే కాలు కోల్పోయింది...



చికిత్స పొందుతున్న ఇమామ్ హుస్సేన్

జమ్మలమడుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెన్నానది ఒడ్డున ఓ సత్రం వద్ద గరండాలను చోరీ చేసేందుకు శనివారం సాయంత్రం వెళ్లి గరండాలు మీదపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే... గడ్డవీధి వాసులు ఇమామ్ హుస్సేన్, తలారి బుజ్జి మద్యానికి బానిసలయ్యారు. ఈ క్రమంలో పెన్నానది ఒడ్డున సత్రం గరండాలు చోరీ చేసేందుకు మద్యం మత్తులోనే వెళ్లి అక్కడున్న పిల్లర్సను గడ్డపారతో తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో గరండ మీదపడి ఇమామ్‌హుస్సేన్‌కు కుడికాలు తెగింది. ఘటన స్థలంలోనే పడిపోయాడు. ఎడమచెయ్యి విరిగింది. బుజ్జికి కుడి మోకాలుకు రక్తగాయం కాగా ఎడమకాలు విరిగింది. గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఒకరిని కడప రిమ్స్‌కు మరొకరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని జమ్మలమడుగు అర్బన్ పోలీసులు సందర్శించి పరిశీలించారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 9:(ఆంధ్రజ్యోతి): తన తల్లిని దూషించాడన్న కోపంతో 6న వెంకటనారాయణను హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు రైల్వే కోడూరు సీఐ హేమసుందరరావు తెలిపారు. వివరాల్లోకెళితే... కోడూరు వాసి వెంకటనారాయణ ఫ్లోరింగ్ పనులు చేస్తుంటాడు. రెండేళ్లుగా అస్గర్ అలీ ఇంటిని బాడుగకు తీసుకుని అందులో సామగ్రి నిల్వ ఉంచేవాడు. ఇంటి అద్దె విషయంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఒకసారి వెంకటనారాయణ ఇంటి యజమాని తల్లిని దూషించాడు. కాగా ఫిబ్రవరిలో పనుల నిమిత్తం అనంత పురానికి వెళ్లిన అతను ఈ నెల 5న కోడూరుకు వస్తున్నట్లు తెలుసుకున్న అస్గర్ అలీ తన మిత్రుడు సునీల్ తేజతో కలసి అతన్ని చంపేందుకు పథకం రచించాడు. కోడూరుకు వచ్చిన వెంకటనారాయణకు ఫోన్ చేసి మద్యం తాగేందుకు ఆహ్వానిం చాడు. అతనితో కలసి రెడ్డివారిపల్లె పంచాయతీ చోడవరం చెరువు కట్టపైకి వెళ్లి మ ద్యం తాగుతుండగా మెడపై కత్తితో దాడి చేసి చంపినట్లు సీఐ వివరించారు. ఈ కేసులో నిందితులను శనివారం ఎక్సైజ్ కార్యాలయం వద్ద అదుపు లోకి తీసుకుని బైకు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కోడూరు అర్బన్ సీఐ హేమసుందర రావు, ఎస్ఐ నవీన్ కుమార్ సిబ్బంది రాజేంద్ర స్వామి, బాలాజీ, ఆకేష్, రాజును ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, డీఎస్పీ సుధాకర్ అభినందించారు.

తరు విలాపం




చెట్లు నరకడం వినాశనమే ● తరగిపోతున్న వృక్షసంపద

నాటుడు కంటే నరుకుడే ఎక్కువ ● అధికారులకు పట్టని వాల్టా

బద్వేలుటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'ఎందరికో నీడ, ఫలాలు, కొయ్య, ఇంటికి అవసరమయ్యే పరికరాలను అందిస్తూ ఎంతో పచ్చగా ఉండే నన్ను నరకడం మానవ వినాశనానికి హేతువు. విశ్వానికి వెలుగు దివ్వెగా నిలిచి ప్రాణవాయువును అందిస్తూ మానవాళిని రక్షించే ఏకైక సాధనాన్ని. నా ఆగమనం. చల్లని మేఘాలకు తీపికబురు నా శ్వాస.... సుతిమెత్తని నాస్పర్శతోనే వరుణుడు పరవశమవుతాడు. నా తనువుచాటున భూమాత చల్లగా పవళిస్తుంది. సకల జనుల సుభిక్షానికి నా మనుగడే ప్రధానం. అలాంటి నాకే నిలువనీడలేకుండా చేశారు. మారణాయుధాలతో నన్ను ఖండఖండాలుగా నరికేస్తున్నారు. నేలేని ప్రపంచమే శూన్యం.. అంటూ ఓ తరువు తరుముకొస్తున్న ప్రళయాన్ని చెబుతూ రక్తకన్నీటిని నేలరాలుస్తోంది.

ప్రకృతి ప్రకోపానికి మానవాళి అంతమయ్యే ఘడియలు దగ్గరలోనే ఉన్నాయనిపిస్తుంది. జిల్లా వ్యాప్తంగా చుక్కనీరులేక, నిలువనీడలేక నిప్పులకుంపటి నడుమ మండిపోతున్నా మనిషి మారడంలేదు. ధనాపేక్షే ధ్యేయంగా స్వార్థానికి పచ్చనిచెట్లను కొందరు నరికి సొమ్ము చేసుకుంటున్నారు. కరువు నిలయమైన ప్రాంతాల్లో అధికంగా మొక్కలు పెంచాల్సింది పోయి ఉన్నవాటినే నేలకూల్చుతున్నారు.

వాతావరణ సమతుల్యతను కాపాడే క్రమంలో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అనుగుణంగా ప్రజలు అధికారుల్లో చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం ఆశించిన ఆశయం సఫలమవుతుంది. కళ్లముందే భయాందోళనలు కన్పిస్తున్నా ఎవరికి వారు మిన్నకుంటున్నారు. నీరు, చెట్టు, నేల పరిరక్షణ కోసం 2002లో ప్రవేశపెట్టిన వాల్టాచట్టాన్ని కొందరు స్వార్థపరులు ఉల్లాపల్లా చేస్తున్నారు. ప్రకృతి ప్రసాదిత వనసంపద కనుమరుగైపోతోంది. స్వార్థంతో పచ్చనిచెట్లను నరికేస్తుండడంతో సకాలంలో వర్షాలు కురవక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లగా సాధారణం కంటే తక్కువ శాతం వర్షాలు కురవడంతో రైతులు కరువుతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. సకాలంలో వర్షాలు కుర వకపోవడానికి కారణం అడవుల పట్ల నిర్లక్ష్యం వహించడం, కాపాడుకోలేక పోవడమేనని తెలిసినా ఇష్టానుసారంగా అటవీ ప్రాంతాల్లో, రహదారుల పక్కన, పట్టా భూముల్లో యథేచ్ఛగా పచ్చని చెట్లను నరికేస్తున్నారు. పట్టా ఉన్నా, అనుమతులు తీసుకోవాలన్న నిబంధనలు ఉన్నా, ఇవేమీ పట్టించుకోకుండా చెట్లను నరికి విక్రయిస్తున్నారు. అటవీశాఖ అధికారులు పట్టించుకోక పోవడంతోనే పచ్చనిచెట్ల నేలకొరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో మొక్కలను నాటి తరువాత వదిలేయడంతో రక్షణ కరువై నీటని లువునా మొక్కలు ఎండిపోతున్నాయి. ఇన్ని లక్షల మొక్కలు నాటామని అధికారులు లెక్కలు చెప్పడమే తప్ప, నాటిన మొక్క లను ఎన్నింటిని సంరరక్షించారన్న మాటలకు అధికారుల్లో సమాధానం లేదు. ఇప్పటికైనా అధికారులు మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటే మంచిది.



బద్వేలు హైవేపై చెట్లను నరికేస్తున్న దృశ్యం

నాటుడు కంటే నరుకుడే ఎక్కువ

ఏడాదికి ఏడాది అటవీ విస్తీర్ణం తగ్గిపోతోంది. జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాల నుంచి కలప అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయడంలో ఫారెస్ట్ అధికారులు అడ్డుకట్ట వేయకపోవడంతో ఆయా ప్రాంతాల నుంచి వంట చెరుకు, ఇటుకల బట్టీలకు, బొగ్గుల తయారీకి, నివాసగృహా ల కలపకు ట్రాక్టర్ల, లారీల నుంచి వృక్షసంపద తరలిపో తోంది. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లారీల్లో తరలివెళుతున్న వృక్షసంపద (ఫైల్‌ఫొటో)



9 మందికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి 9 మందిని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యా అవార్డులకు విద్యాశాఖ ఎంపిక చేసింది. విశేష ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను సోమవారం మంగళగిరిలో సత్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5న జరగాల్సిన గురుపూజోత్సవాన్ని విజయవాడ వరదల కారణంగా ప్రభుత్వం వాయిదా వేసింది. అయితే ఈ వేడుకలు సోమవారం విజయవాడ ఎక్స్‌కన్వెన్షన్ సెంటరులో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యాశాఖమంత్రి నారాలోకేశ్ హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందజేయనున్నారు

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు పాఠశాల విద్యకు సంబంధించి ప్రొద్దుటూరు మోడంపల్లె మున్సిపల్ హైస్కూలు బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు కొండారెడ్డి ఎంపికయ్యారు.

కళాశాలల విభాగంలో

జూనియర్ కళాశాల విభాగంలో జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల, బోటనీ అధ్యాపకుడు వెంకటక్రిష్ణయ్య ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. టెక్నికల్ విభాగంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల సివిల్ ఇంజనీరు అధ్యాపకులు మహేశ్ ఎంపికయ్యారు. డిగ్రీకళాశాల విభాగంలో కడప ప్రభుత్వ పురుషుల కళాశాల అధ్యాపకులు డాక్టర్ సయ్యద్ వసూరుల్లాఫక్రీయారి, డాక్టర్ నీలయ్య, కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి.విజయలక్ష్మీదేవి ఉత్తమ అధ్యాపకులుగాఎంపికయ్యారు. యూనివర్శిటీ విభాగం నుంచి వైవీయూ ప్రొఫెసర్ విజయభారతి, ప్రొఫెసరు ఎల్.వీ రాంజేయరెడ్డి, ప్రొఫెసర్ ఎం.అనిత ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు.

12 నుంచి గండి క్షేత్రంలో పవిత్రోత్సవాలు

చక్రాయపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండిలో ఈనెల 12వ తేదీ మంగళవారం నుంచి 15వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తారని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. 12న అంకురార్పణతో ప్రారంభమై అనుజ్ఞ, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం తదితర పూజాకార్యక్రమాలు ఉంటాయన్నారు. 13, 14వ తేదీల్లో ఆరాధనలు జరుగుతాయన్నారు.

'వేధింపులతోనే ఆత్మహత్యకు యత్నించా'

కడప క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్నచౌకు రైటర్ శివకుమార్ వేధింపులతోనే ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించానని కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. కడప నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ తనకు అనారోగ్యం ఉందని తెలిసి కూడా ఇతర ప్రాంతాలకు రైటర్ డ్యూటీ వేయించాడన్నారు. ఉద్దేశపూర్వకంగానే డ్యూటీలు వేశాడని ఆరోపించారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల వద్ద విషరసాయనం తాగి బైకుపై డీటీసీ వద్దకు వెళ్లగా అప్పటికే అపస్మార స్థితిలో కింద పడిన తనను కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. ఈ విషయంపై చిన్నచౌకు రైటర్ శివకుమార్ వివరణ అడగ్గా అశోక్ ఎప్పుడూ డ్యూటీ చేయలేదని, విజయవాడ డ్యూటీకి వెళ్తావా అని అడిగాను తప్ప నేను డ్యూటీ వేయలేదని తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు.

ఎర్రచందనం దుంగలు పట్టివేత

● కారు స్వాధీనం, ఒకరి అరెస్టు

రైల్వేకోడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కారులో తరలిస్తున్న ఆరు ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ పి.నరేష్, ఎఫ్‌బీఓ నాగేశ్వర్‌నాయక్, సిబ్బంది శనివారం తిరుపతి-కడప జాతీయ రహదారిలోని ఎం.బావి వద్ద వాహనాలను తనిఖీలో ఇద్దరు కారు దిగి పారిపోయేందుకు ప్రయత్నించారు. టాస్క్‌ఫోర్సు బృందం వారిని వెంటాడి ఒకరిని అదుపులోకి తీసుకుంది. విచారణలో నిందితుడు ఒంటిమిట్టకు చెందిన వాడిగా తేలింది. 6 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించారు. అతడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ రఫీ తెలిపారు.

బాలికకు పెళ్లి యత్నం - అడ్డుకున్న పోలీసులు

ముద్దనూరు నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామంలో బాలికకు నిశ్చయతాంబూలాన్ని పోలీసులు అడ్డుకున్నారు. సీఐ సమాచారం మేరకు వివరాలు.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 16 ఏళ్ల బాలికకు కొండాపురం వాసితో నిశ్చయతాంబూలం నిర్వహిస్తున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదుపై పోలీసులను పంపి ఆపివేశారు. బాలిక తండ్రిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

48 చీనీచెట్లు నరికి వేత

ముద్దనూరు నవంబరు9(ఆంధ్రజ్యోతి): మంగపట్నంలో శుక్రవారం రాత్రి బోడెద్దుల బయపురెడ్డికి చెందిన చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. ఐదెకరాల్లో చీనీ చెట్లు ఉండగా 48 చీనీచెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికేసినట్లు, బాధితుని ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాష్ట్ర అవార్డుకు కొండారెడ్డి



ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డీబీసీఎస్ మున్సిపల్ హైస్కూలు జీవశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీయపురెడ్డి కొండారెడ్డిని ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది. 1995లో మోడంపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధుల్లో చేరారు. 2003లో డీబీసీఎస్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ కావడంతో ఆ పాఠశాలకు వెళ్లారు. 2007లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడుగా పదోన్నతి పొంది అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. ఆయన ఆధ్వర్యంలో ఆ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో పాల్గొన్నారు. 2011లో రాజస్థాన్‌లో జరిగిన జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌లో, 2013లో భోపాల్‌లో జాతీయస్థాయి సైన్స్‌ఫేర్‌లో డీబీసీఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆయన ఆధ్వర్యంలో 18సార్లు రాష్ట్రస్థాయి, మూడుసార్లు జాతీయస్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఏపీ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో మూడుసార్లు పాల్గొన్నారు. ఉపాధ్యాయ వృత్తికన్నా ముందు ఆయన చెక్కభజన కళాకారుడు. 1988లో మహానాడులో చెక్కభజన చేసి అప్పటి సీఎం ఎన్టీరామారావు నుంచి బహుమతి అందుకున్నారు. కడప దశాబ్ది ఉత్సవాల్లో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఆయన ప్రతిభను గుర్తించి 2016లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేశారు. ఈ ఏడాది డిసెంబరు 31న రిటైర్ కానున్నారు. అవార్డుకు ఎంపిక కావడంపట్ల కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

50 కిలోల గంజాయి స్వాధీనం

చిట్వేలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనుంపల్లె చెక్‌పోస్టు వద్ద 50 కిలోల గంజాయిని, కారును స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు. శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. గంజాయి రవాణాపై సమాచారం అందడంతో తహసీల్దారు మోహనక్రిష్ణ, ఓబులవారిపల్లె ఎస్ఐ మహేశ్, చిట్వేలి ఎస్ఐ రఘురాం, సిబ్బందితో కలిసి చెక్‌పోస్టు వద్ద నిఘా ఉంచారు. రాపూరు నుంచి చిట్వేలి వైపు వస్తున్న కారు ఆపకుండా వెళ్లిపోవడంతో వెంబడించి పట్టుకున్నామన్నారు. కారులో 50 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. శ్రీకాళహస్తికి చెందిన సాయి చైతన్య కారుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిని శనివారం రాజంపేట కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

నలుగురు దొంగలు అరెస్ట్

చిట్వేలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని శనివారం అదుపులోకి తీసుకున్నట్టు రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ చర్చి సమీపంలో దుండగులు గత నెల 21న తనను బెదిరించి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారని ఈ నెల 5న ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్ఐ రఘురాం శనివారం బైక్‌పై వెళుతున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అనంతపురం జిల్లా గుంతకల్లు వాసులు ఏఎం మోసిన్, షేక్ హైదర్ అలీ, సయ్యద్ రసిక్యూ హుస్సేన్ అజీజ్, జాఫ్రి అలీ రాజా అజీజ్‌గా తేలిందన్నారు. వీరి నుంచి 16 గ్రాముల బంగారు చైను, మోటారుబైకును స్వాధీనం చేసుకుని రాజంపేట కోర్టుకు హాజరుపరిచామని సీఐ వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ప్రతిభావంతులకు కొదవ లేదు: ఈడీ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ప్రతిభావంతులకు కొదవ లేదని, అన్ని రంగాల్లోనూ ప్రతిభ గలవారు ఎందరో ఉన్నారని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. శనివారం రాష్ట్ర పర్యాటక ఎక్సలెన్సీ అవార్డు సాధించిన గంగాధర్, నాగార్జున యూనివర్సిటీ డీఓఏ చైర్మన్‌గా ఎంపికైన డాక్టర్ మృత్యుంజయరావును రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ జిల్లా వారసత్వం, పర్యాటక కళాభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థల సభ్యులకు వరుసగా ప్రతిష్టాత్మక అవార్డులు లభించడం గర్వకారణమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ టూరిజం సంస్థ పద్మప్రియ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి వల్లూరు జనార్ధన రాజు, వైవీయూ కన్సల్టెంట్లు వెంకటేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

సీకేదిన్నె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్యసిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు తెలిపారు. శనివారం చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులు, మందుల విభాగం, రక్త పరీక్షలు సక్రమంగా నిర్వహించడంతో పాటు మెరుగైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. సీజనల్ వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన కలిగించి వారిని అప్రమత్తం చేయాలన్నారు. అదే విధంగా ఈనెల 14 నుంచి ప్రభుత్వం చేపడుతున్న అసంక్రమిత వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ గుర్తింపునకు చేపట్టే సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. తద్వారా కచ్చితమైన సమాచారం రావడంతోపాటు ప్రభుత్వం అమలు చేసే పథకాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రాఘవేంద్ర, సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

పెండ్లిమర్రి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 గ్రామ పంచాయతీల్లోనూ సభ్యత్వ కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీల నుంచి సభ్యత్వ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

మాజీ సర్పంచ్‌కు పుత్తా పరామర్శ



వైద్యుడితో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండపేట మాజీ సర్పంచ్ చాందమ్మగారి బాషు అనారోగ్యంతో కడప నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు పుత్తా నరసింహారెడ్డి పరామర్శించారు.మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. బాషు సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా బయటికి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మన్యం మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గౌస్‌పీర్, సంజీవ్‌పవన్, గౌస్‌లాజం, ఖాసిం పీరా తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ భాష అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మైనార్టీల పక్షపాతి అని, ఉర్దూ భాష అభివృద్ధికి తాను సంపూర్ణంగా సహకరిస్తానని కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. శనివారం కడప నగరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంజుమన్ తరక్కి ఉర్దూ ఆధ్వర్యంలో జాతీయ ఉర్దూ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు చైర్మన్ సత్తార్‌ఫైజి అధ్యక్షత వహించగా హిదయతుల్లా కన్వీనరుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉర్దూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల కొరత ఉందని, సొంత ఖర్చులతో ముద్రించి పంపిణీ చేస్తామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అంజుమన్ తరక్కి ప్రతినిధుల బృందాన్ని సీఎం చంద్రబాబు తో చర్చిస్తామన్నారు. అమీర్‌బాబు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు, ఉర్దూ భాషాభివృద్ధికి టీడీపీ అధినేత చంద్రబాబు ముందుంటారన్నారు. ఆయన హయాంలోనే ఉర్దూకు రెండో అధికార భాషగా హోదా కల్పించారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉర్దూ భాషను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

పులివెందుల టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఆ పాఠశాలల జాయింట్ సెక్రటరీ మురళీక్రిష్ణ అన్నారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని బెస్తవారిపల్లె సమీపంలో ఉన్న అంబేడ్కర్ గురుకులపాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వసతిగృహంలోని వసతి సముదాయాలను పరిశీలించారు. చేశారు. అక్కడే విద్యార్థులతో రాత్రి బస చేశారు. శనివార ఉదయం విద్యార్థులతో కలిసివ్యాయామ కృత్యాలు తీర్చుకున్నారు.

'ఏపీ ఉద్యోగుల సంఘానికి, ఆస్కార్ రావుకు సంబంధం లేదు'

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి, మాజీ రాష్ట్ర కార్యదర్శి అయిన ఆస్కార్‌రావుకు ఎటువంటి సంబంధం లేదని ఆ సంఘం ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఏపీ ప్రభుత్వం ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రమేశ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ నాయకత్వాన్నే ప్రభుత్వం గుర్తించిందన్నారు. కానీ ఆదివారం సంఘం బ్యానర్‌పై కొంతమంది సమావేశాన్ని నిర్వహించనున్నారన్నారు. గతంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆస్కార్‌రావును, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న శ్రీకాంత్‌రాజును సంఘం నుంచి తొలగించారన్నారు. ఈక్రమంలో వారికి, సంఘానికి ఎటువంటి సంబంధం లేదన్నారు.

చీడ పురుగుల నివారణకు బ్రహ్మాస్త్రం పిచికారీ చేయాలి

వేముల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల పురుగుల నివారణకు బ్రహ్మాస్త్రం కషాయం పిచికారీ చేయాలని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రమైన వేముల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పలువురు రైతులకు బ్రహ్మాస్త్రం కషాయం తయారు చేశారు. వేప, పరంచ, సీతాఫలం, కానుగ, ఉమ్మెత్త ఆకులు తీసుకొని 20 లీటర్ల నాటు ఆవు మూత్రం తీసుకొని అన్నీకలిపి ఉడకబెట్టి 48గంటల తర్వాత ఉపయోగించాలని వివరించారు. పంట దశను బట్టి రెండు నుంచి నాలుగు లీటర్ల దాకా అన్ని పంటలు, మొక్కలకు పిచికారీ చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పెట్టుబడులు తగ్గి అధిక ఆదాయాలు ఆర్జించవచ్చన్నారు.

గోవులకు మహిళల పూజలు



మల్లేశ్వరాలయంలో గోవులను పూజిస్తున్న దృశ్యం

చెన్నూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస బహుళపక్ష అష్టమి సందర్భంగా చెన్నూరు మల్లేశ్వరాలయంలో శనివారం గోపాష్టమి సందర్భంగా మహిళలు గోవులను పూజించారు. అలాగే గోవుల చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు మనోహరాచార్యులు మాట్లాడుతూ గోవులు ఎంతో పవిత్రమైనవన్నారు. సర్వశుభాలకు నిలయమైన గోమాతను నిత్యం పూజించి తరించి శాంతి సౌభాగ్యాలు అందుకోవాలని ఆయన సూచించారు.

'సావిత్రి నియామకం హర్షణీయం'

కడప మారుతీనగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రజకుల అభివృద్ధికి బాటలు వేసేలా రజక కార్పొరేషన్ చైర్మన్‌గా సావిత్రిని నియమించడం హర్షణీయమని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాగమల్లేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక నబీకోటలోని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు.



ఇది వేంపల్లె-పులివెందుల ప్రధాన రహదారి. రోడ్డు నిర్మాణం కోసం తవ్వి అలాగే వదిలేయడంతో పిచ్చి మొక్కలకు నిలయమైంది. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి నాలుగు రోడ్ల కూడలి సమీపం వరకు ఒకవైపు రోడ్డు వేశారు. రెండో వైపు రోడ్డు వేసేందుకు గుంతలు తవ్వి వదిలేశారు. నిత్యం వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలని విన్నవిస్తున్నారు. -వేంపల్లె, (ఆంధ్రజ్యోతి)

ఎమ్మెల్సీకి ఎరువుల దుకాణదారుల వినతి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందిస్తున్న గురునాథరెడ్డి, ఫర్టిలైజర్స్ యాజమానులు

పులివెందుల టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పట్టణంలోని పురుగు మందులు, ఎరువులు, విత్తన డీలర్లు శనివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాదారులు మాట్లాడుతూ పులివెందుల ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారన్నారు. పంట పొలాల్లో గడ్డి నిర్మూలనకు కూలీలు దొరక్క రైతులు గ్లైపోసిట్ అనే కలుపు మందును వాడుతున్నారన్నారు. దీన్ని నిషేధించడం వల్ల రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ మందును ఇతర ప్రాంతాల్లోని దుకాణాల్లో అమ్ముతున్నారని, కానీ మన ప్రాంతంలో లభించకపోవడం వల్ల ఇబ్బంది ఎదురవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ యజమానులు గురునాథరెడ్డి, మనోహర్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

పులివెందుల టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణ పరిధిలోని వాసవీకాలనీకి చెందిన శ్రావణ్‌కుమార్ (40) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రావణ్‌కుమార్ భార్య లక్ష్మి కథనం మేరకు.. గత కొద్ది కాలంగా అప్పుల సమస్య తీవ్రం కావడంతో మనస్థాపం చెందాడు. దీంతో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిలిచిపోయిన రోడ్డు పనులు

● అస్తవ్యస్తంగా డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులు ● పులివెందుల మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యతో ప్రజల ఇక్కట్లు



పులివెందుల మున్సిపాలిటీ ఎర్రగుడిపల్లెలో అర్థంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులు

పులివెందుల రూరల్, నవంబరు 9: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలలో సీసీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీనికి తోడు డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులు అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... మున్సిపాలిటీలోని బాకరాపురం, యర్రగుడిపల్లె, కె.వెలమవారిపల్లె, వెంకటాపురం, పెద్దరంగాపురం, జయమ్మకాలనీ, చెన్నారెడ్డికాలనీ, నగరిగుట్ట, వైఎస్సార్ కాలనీ తదితర ప్రాంతాలలో రోడ్డు పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పలుచోట్ల నూతన డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ల పేరుతో గతంలో ఉన్న సీసీ రోడ్డును కట్‌చేసి పనులు పూర్తి చేశారు. అయితే అసంపూర్తిగా వదిలేశారు. మిగిలిన రోడ్డును కూడా తొలగించి నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అలాగే వదిలేసినట్లు తెలిసింది. కాగా పలు ప్రాంతాలలో రోడ్డు నిర్మాణం కోసం మట్టి తోలి కంకరవేశారు. రోడ్లు పూర్తికాకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్‌లు అస్తవ్యస్థం

డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులు కూడా అస్తవ్యస్థంగా చేసినట్లు సంబంధిత సిబ్బంది చెబుతున్నారు. ఒకే పైప్‌లైన్‌లో రెండు అడుగుల గ్యాప్‌తో ఏర్పాటు చేశారు. పనులు పూర్తి చేసి మట్టి తోలినప్పటికి ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుక లేదా, కంకరను పరిచారు. ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలతో పైప్‌లైన్‌లు లీకయ్యాయి. ఈ లీకుల పైప్‌లైన్ పనులు కూడా చేపట్టలేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పనుల్లో నిర్లక్ష్యం

పులివెందుల మున్సిపాలిటీలో జరిగిన పనుల తీరు చూస్తే ప్రజాప్రతినిధుల అత్యుత్సాహం, అధికారులు, కాంట్రాక్టర్ల ఏకాగ్రత లేకపోవడం కారణంగా తెలుస్తోంది. డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులు అస్తవ్యస్తంగా చేపట్టారు. నిధులు వరదలా పారడంతో పనులు మంజూరయ్యాయి. అయితే ఈ పనులు ఎవరెవరికి అప్పగించాలనే కసరత్తులో భాగంగా ప్రజాప్రతినిధులు తలలుపట్టుకునేవారని సమాచారం. ఎందుకంటే మున్సిపాలిటీలో అందరూ ఏకగ్రీవం అయిన కౌన్సిలర్లే. ఒకే వార్డులో అనేక పనులు చేపట్టాల్సి రావడంతో కొందరు కౌన్సిలర్లు తామే చేస్తామని భీష్మించుకు కూర్చునేవారని తెలిసింది. పనులు సకాలంలో పూర్తికాకపోవడానికి కారణం కూడా ఇదే అని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఏంచేయాలో తెలియని అధికారులు మున్సిపాలిటీకి పెద్దన్నగా వ్యవహరించే ఓ ప్రజాప్రతినిధిపై ఆధారపడాల్సి వచ్చిందని సమాచారం. దీంతో ఆ పెద్దన్న కౌన్సిలర్లతో పాటు చోటామోటా నాయకులు, కార్యకర్తలకు అప్పగించారు. కనీస అర్హత లేని వారికి కూడా పనులు అప్పగించడంతో వారు ఇష్టానుసారం పనులు చేసినట్లు చెబుతున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో హడావుడిగా పనులు చేపట్టి పూర్తిచేయలేకపోయారని అధికారులే అంటున్నారు. ఎప్పుడో పూర్తి చేయాల్సిన పనులు అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఇలా అతుకులు, గతుకులు, కంకర రోడ్లపై ప్రయాణం సాగించాల్సి వస్తోందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరు కావాలి

ఆయా ప్రాంతాల్లోని పనులన్నీ కూడా పాడా కింద మంజూరైనవే. పనులు మొదలు కాని కారణంగా ఇటీవల కౌన్సిల్ తీర్మానంతో 94 పనులను రద్దు చేశాం. నిధులు మంజూరైతే పనులు మొదలుపెడతాం.
- రాముడు, మున్సిపల్ కమిషనర్, పులివెందుల



బాకరాపురంలో లీకేజీ అవుతున్న తాగునీరు



బాకరాపురంలో లీకేజీ అవుతున్న మురుగునీరు

గడ్డివామి దగ్ధం

వేంపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలం కుమ్మరాంపల్లె సమీపంలో గంగిరెడ్డి శ్రీరామిరెడ్డికి చెందిన గడ్డివామి శనివారం దగ్ధమైంది. శనివారం మధ్యాహ్నం ప్రాంతంలో నిప్పు అంటుకొని మంటలు చెలరేగాయి. దీంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

కమలాపురం రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గెలుపోటములను సమానంగా తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. శనివారం డిగ్రీ కళాశాల ఆవరణంలో 68వ రాష్ట్రస్థాయి బాల బాలికల అండర్ 14 రగ్బీ క్రీడా పోటీలను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవరుచుకోవాలన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, యూనివర్సిటీ క్రీడా విభాగం ప్రొఫెసర్ రామసుబ్బారెడ్డి, మండల విద్యాశాఖ అధికారి సుభాషిణి, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, మస్తానయ్య, సూర్యసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీ బ్రౌన్ 226వ జయంత్యోత్సవం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ నెల 10న తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్ 226వ జయంతి ఉత్సవం, అష్టావధాన కార్యక్రమాలు నిర్వహిసుతన్నట్లు సంచాలకులు ప్రొఫెసరు పార్వతి తెలిపారు. ముఖ్యఅతిథిగా వైవీయూ వీసీ క్రిష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, గౌరవ అతిథిగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంజీవమ్మ హాజరవుతారన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గీతాంజలి హైస్కూలులో 10వ తేదీ ఉదయం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నాగార్జున ఐటీఐ ప్రిన్సిపాల్ పి.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు.టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాకు ప్రముఖ కంపెనీలు వస్తున్నాయని, 15 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. 10, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్ పాసైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనాథ వృద్ధురాలికి ఆశ్రయం

పోరుమామిళ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అనాథ వృద్ధురాలిని వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకుడు రామక్రిష్ణారెడ్డి ఆదుకుని ఆమెకు ఆశ్రయం కల్పించారు. శనివారం పోరుమామిళ్లలో ఉన్న ఓ అనాథ వృద్ధురాలిని ఆయన తమ ఆశ్రమానికి తీసుకెళ్లి ఆశ్రయం కల్పించారు.

..తవ్వుకున్నంత..!

● అనుమతులు నిల్ - అక్రమ రవాణా ఫుల్ ● యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

దువ్వూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏదైనా పనిచేసేటప్పుడు చట్టబద్ధంగా ఉండాలి. చట్టవిరుద్ధంగా నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారం చేసే పనులకు చెక్ పెట్టేందుకు అధికార యంత్రాంగం జోక్యం చేసుకోవడం పరిపాటిగా జరిగే విషయమే. కానీ అక్రమ వ్యవహారాలు దువ్వూరులో జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ఇటువంటి తతంగం ఎర్ర గ్రావెల్ తవ్వకాల విషయంలో జరుగుతోంది. ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే గ్రావెల్‌ను ఇక్కడ కొల్లగొడుతున్నారు. తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత అన్న చందంగా ఎర్ర గ్రావెల్ అక్రమార్కులకు వరంగా మారింది.

● దువ్వూరు మండలం ఎర్రగ్రావెల్ అక్రమ రవాణా తవ్వకాలకు అడ్డాగా మారింది. ఇక్కడి నుంచి నిత్యం గ్రావెల్‌ను ట్రాక్టర్లు, మినీ లారీల ద్వారా తరలిస్తున్నారు. గ్రావెల్‌ను మెటల్, ఇతరత్రా రోడ్ల నిర్మాణాలకు వాడుతారు. ప్లాట్ల నిర్మాణంలో భాగంగా గ్రావెల్‌తో రోడ్లు వేస్తే అందంగా ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ కారణంగా అధిక రేటు పెట్టి దీన్ని కొనుగోలు చేస్తారు. దీంతో ట్రాక్టర్ యజమానులు అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలను చేపట్టి పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న గ్రావెల్ ట్రాక్టర్లు(ఫైల్)


దువ్వూరు సమీప గుట్టల్లో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గోతులు

మండల పరిధిలోని దువ్వూరు గుట్టలో ఇష్టానుసారం తవ్వకాలు జరుపుతున్నారు. సాధారణంగా గ్రావెల్ తవ్వాలంటే అనుమతులు తప్పనిసరి. ఈ నిబంధనలు తుంగలో తొక్కి అక్రమార్కులు రాత్రివేళ అడ్డగోలు తవ్వకాలు చేస్తున్నారు. అడపా దడపా పోలీసు, రెవెన్యూ అధికారులు దాడులు చేసి వాహనాలను పట్టుకున్నా వీరు ఏమాత్రం జంకడంలేదు. ఒకటి, రెండు రోజులు విరామం ఇచ్చి తిరిగి తవ్వకాలు చేస్తున్నారు. వాహనదారులు ప్రొద్దుటూరు, రాజుపాళెం, చాపాడు ప్రాంతాలకు గ్రావెల్‌ను తరలిస్తున్నారు. గ్రావెల్ అక్రమ వ్యాపారాన్ని అరికట్టే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మైనింగ్‌శాఖ ద్వారా అనుమతులు తీసుకుని ఆ ప్రాంతంలోనే తవ్వకాలు చేపట్టాలి. ఎక్కడైతే అనుమతులు ఇస్తారో అక్కడే తవ్వకాలు చేపట్టాలి. దీనిలో రాజకీయ ఒత్తిడులు తీసుకురావడం తగదు. చర్యలు కఠినంగా తీసుకుంటాం.


● జి.అక్బర్‌బాష, తహసీల్దారు, దువ్వూరు.

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జమ్మలమడుగు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి సూచించారు. శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో న్యాయ సేవల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి న్యాయవిజ్ఞాన సదస్సును ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు అందించారు. డిసెంబరు 14వ తేదీ జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ కె.వి.మురళీధర్‌రెడ్డి, న్యాయవాదులు భూతమాపురం సుబ్బారావు, జంబాపురం మహేశ్వరి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: ప్రజలు చట్టాలు, న్యాయసేవలపై అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి అన్నారు. లీగల్ సర్వీసెస్ డే పురస్కరించుకుని శనివారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె కోర్టులో అందించే న్యాయ సేవలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కోర్టు కానిస్టేబుళ్లు ప్రజలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లెలో వెలసిన లక్ష్మీ నరసింహుని ఆలయంలో కార్తీక మాసం రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామునే ప్రత్యేక అభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు. దాతలు సిద్దవటం మండలం కొత్తపల్లెకు చెందిన రాజోలి మునెయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆధార్ పేరుతో ఘరానా మోసం

గోపవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్నగోపవరంలో కలువాయి రామలక్ష్మి వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు మాయమాటలు చెప్పి బంగారు నగలను అపహరించుకుని పరారీ అయ్యారు. ప్రభుత్వ పథకాలు వెంటనే ఇవ్వడమే కాక ఆధార్ కార్డును ఇప్పుడే అప్‌లోడ్ చేస్తామంటూ నమ్మబలికి దుండగులు రామలక్ష్మి ఇంట్లోకి ప్రవేశించారు. వెంటనే అక్కడ ఉన్న బంగారు తీసుకుని ఇరుగు పొరుగు వారు వచ్చేలోపలే పారిపోయారు. కాగా బాధితురాలు మాట్లాడుతూ నాలుగు తులాల బంగారు సరుడు పక్కన పెట్టడంతో దాన్ని తీసుకుని బైకుపై దుండగులు పరారీ అయ్యారన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఎన్నిక


శివకళ్యాణి, కల్పన

ప్రొద్దుటూరు,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగునాడు అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులుగా బోగా శివకళ్యాణి, కల్పనను ఏకగ్రీకంగా ఎన్నుకున్నారు. ఆమేరకు ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి వీరి పేర్లను ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా రాణిని ఎన్నుకున్నారు. పూర్తి స్థాయిలో బాడీ ఎంపికను త్వరలో ప్రతి సెక్టార్ నుంచి సభ్యులను ఎంపిక చేస్తామన్నారు. ఈయూనియన్ అంగన్‌వాడీవర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కృషి చేస్తుందన్నారు. యూనియన్ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ముందు పెట్టి పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ గీతాశ్రమంలో పది రోజులుగా నిర్వహిస్తున్న నామా ఎరుకలయ్య, నామా కమలాక్షమ్మ ఆరాధన ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా కృష్ణమందిరంలో కృష్ణునికి, నామా ఎరుకలయ్య, కమలాక్షమ్మ, మళయాళ స్వామికి పూజలు నిర్వహించారు. సాయంత్రం నటరాజ కళాక్షేత్రం చిన్నారులతో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

కొర్రపాడు రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోండి

ప్రొద్దుటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రధాన రోడ్డులో ఒకటైన కొర్రపాడురోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆయన మున్సిపల్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్‌ఎస్ మాల్ దగ్గరనుంచి కొర్రపాడురోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయన్నారు. ఎర్రన్న కొట్టాలలో ఎన్ని కట్టడాలు విస్తరణ పరిధిలోకి వస్తాయో గతంలో ఇచ్చిన మార్కింగ్ ఆధారంగా వాటి విలువ అంచనావేయాలన్నారు. అలాగే ఖాళీ స్థలాలు ఏమేరకు విస్తరణ పరిధిలోకి వస్తాయో పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయాలన్నారు. కొర్రపాడురోడ్డు విస్తరణతోపాటు పట్టణంలోని మరిన్ని రోడ్లు విస్తరించే పనులు చేపట్టాల్సివుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తహసీల్దారు గంగయ్య, ఆర్‌అండ్‌బీ టౌన్‌ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాశినాయన నవంబరు(ఆంధ్రజ్యోతి)9: నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వపు విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆకార్యక్రమ నిర్వాహకుడు పాఠశాల పూర్వపు విద్యార్థి ఏపీఎస్‌పీ 11వ బెటాలిన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న కోదండరామయ్య తెలిపారు. ఈసమ్మేళనంలో 1990-91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు తప్పక పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ

పోరుమామిళ్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి రవిబాబు తనిఖీ చేశారు. శనివారం ఆయన ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసి ప్రతి నెలా 9న జరిగే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమానికి వచ్చిన గర్భిణీలకు పోషకాహారం జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సేవల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కాన్పుల గది, ల్యాబ్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జయరాజ్, సీహెచ్‌వో నిర్మల, ఆరోగ్య అధికారులు సరస్వతి, నాగమ్మ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీ



బద్వేలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని బలిజసేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం కన్యకా పరమేశ్వరి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణ లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బలిజసేవా సంఘం అధ్యక్షుడు దద్దం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కాగా 17తేదీ వనభోజన కార్యక్రమంలో విజేతలను ప్రకటించి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బలిజసంఘం నాయకులు పాల్గొన్నారు.

'టీడీపీని బలోపేతం చేద్దాం'


టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి

ప్రొద్దుటూరు నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సోములవారిపల్లెలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పల్లేటి రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొద్దుటూరు , నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శనివారం 33వవార్డులో కౌన్సిలర్ గాజుల శివజ్యోతితో కలిసి పర్యటించారు. ముఖ్యంగా వార్డులో ప్రభుత్వ బాలుర హైస్కూలు నుంచి మక్కా మసీదు వరకు వున్న ఆక్రమణలు తొలగించి సీసీరోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మసీదు వద్ద గ్రిల్స్ మరమ్మతులు చేయాలని తెలిపారు. వినాయకనగర్ మోటు నుంచి దేవాంగ పేట కళ్యాణ మండపం వరకు సీసీ రోడ్డు, కాలువల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఏఈ దిల్‌షాద్‌ను ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ సచివాలయ సిబ్బంది,టీఎన్‌టీయూసీ నాయకుడు చింతకుంట కుతుబుద్దీన్ పాల్గొన్నారు.

సొంత పార్టీ నాయకులపై కేసులు పెట్టిన ఘనత మీదే

మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై టీడీపీ నేతల ఆరోపణ



మైదుకూరు రూరల్,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సొంత పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టిన ఘనత మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికే దక్కుతుందని టీడీపీ నాయకులు ఆరోపించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు,మాజీ మండలాధ్యక్షుడు ధనపాల జగన్,తప్పెట శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ హత్యాయత్నం కేసులో అరెస్ట్ అయిన వైసీపీ నాయకులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడిన మాటలు చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మండిపడ్డారు. ధనపాల జగన్ మాట్లాడుతూ గత మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు మాట్లాడుతూ గత ఎంపీపీ ఎన్నికల్లో తిప్పిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ వెంకటసుబ్బయ్య నామినేషన్ వేయడానికి వచ్చినప్పుడు పత్రాలను చింపివేసి తప్పుడు కేసులు పెట్టిన సంగతి మరచిపోయారా అంటూ ఎద్దేవా చేశారు. అంతేకాకుండా గతంలో రఘురామిరెడ్డి అధికారంలో ఉండి కూడా వేసవిలో ఎర్రచెరువుకు నీరు నింపకుండా మున్సిపాలిటీ ప్రజలను ఎండగట్టడం, ఇబ్బందులకు గురిచేయడం ఆయనకే చెల్లుతుందన్నారు.ఈ కార్యక్రమంలో నేతలు ఏపీ రవీంద్ర,ఆకుల కృష్ణయ్య,ఆర్ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, భీమయ్య,బీపీ సుధాకర్,గుండం రాజు సుబ్బయ్య,బండి అమర్‌నాద్,రమణ తదితరులు పాల్గొన్నారు.